

# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### లలితాంగులు

అనాది నుండీ స్త్రీలని లలితాంగులనీ, అబలలనీ, పూబోణులనీ రకరకాలుగా వర్ణిస్తూ, సంబోధిస్తూ మన ప్రాచీన కవులూ, రచయితలూ మనకి ఒక చిత్రం ఇచ్చారు.అంటే... సీన్! ఇప్పుడున్న సీన్ వేరు! మారిపోయింది. రచయితలంతా సమిష్టిగా కృషి చేసి ప్రస్తుతం ఉన్న స్త్రీలకి ఒక డిఫరెంట్ పిక్చర్ ఇచ్చారు. అదెలాగంటే... మనం ప్రతిరోజూ ఉదయం లేచి ఏం చూస్తాం? ఒకప్పుడైతే... "న్యూస్ పేపర్" అనేవారు. కాదు... ఇప్పుడు టీ.వీ. చూస్తాం. ఆ టీ.వీ.లో ఏం చెపితే అది వేదం.... ఏం చూపిస్తే అది సత్యం! ప్రస్తుతం పరిస్థితి అది.

అటువంటి సుదూరదర్శని ప్రైవేట్ ఛానెళ్ళలో ప్రసారమయ్యే సుదీర్ఘ ధారావాహికలు నిండా స్త్రీ పాత్రలే! స్త్రీలకి సాహిత్యంలో ఇస్తున్న అగ్రస్థానం ఇది. ఆ స్త్రీ పాత్రలన్నీ రకరకాల వస్త్రధారణలతో, కొన్ని ఏడుస్తూ, కొని నవ్వుతూ, ఎదుటి వాళ్ళని ఏడిపిస్తూ, మనసులో మాట్లాడుకుంటూ రాబోయే రెండు ఎపిసోడ్ల కథ ముందే వారి స్వగతంలో చెప్పేస్తూ.... తిరిగి వారు చెప్పిందే చూపిస్తూ వుంటాయి.

ఈ రోజు సరదాగా ధారవాహికల్లో ప్రతికూల స్త్రీ పాత్రధారులూ అనే విషయం ముచ్చటించుకుందాం. అంటే సింపుల్ గా టీ.వీ. సీరియల్స్‌లో ఆడవిలన్లు.

ఈ ఆడవిలన్లు చూడటానికే ప్రత్యేకంగా తయారవుతారు. అందరూ గుండ్రంగానో, నిలువుగానో, లేకపోతే డ్రెస్సులకి మేచింగ్ రంగు బొట్లో పెట్టుకుంటారు. కానీ వీళ్ళు అలా కాదు.... మెలికలు తిరిగిన నాగుపాము బొట్లో, ప్రజ్వరిల్లుతున్న అగ్ని శిఖ టైప్‌లోనో బొట్టు పెట్టుకుంటారు. పెదవికో, గెడ్డానికో చిన్న 'స్టడ్' అంటే మెరిసే రాయి కూడా కుట్టించుకుంటున్నారు. అందర్లా కాకుండా మొహానికి కొట్టొచ్చేలా అరంగుళం మందాన మేకప్పు వేసుకుంటారు. కనురెప్పలకి నీలం, ఆకుపచ్చ మొదలైన రంగులు. కొన్ని సార్లు పెదవులకి నలుపు రంగు సైతం వేసుకుంటారు. తలల మీద రకరకాల కుండలూ, మూకుడ్లూ షేపుల్లో కొప్పులూ, స్లీవ్‌లెస్ బ్లౌజులూ, చెవులకి భుజాల దాకా వేళ్ళాడే జూకాలూ, మెడలో సన్యాసులు వేసుకునే లాటి పెద్ద పెద్ద పూసలూ, వాట్ నాట్? అన్ని రకాల అసహజ ఆహార్యాలతో ప్రజలని అలరిస్తారు.

ఇంక పాత్ర ఔచిత్యాల కొస్తే వీరు లేనిదే కథ నడవదు! మొదటి ఎపిసోడ్ నుండే వీళ్ళు ఎంటర్ అయిపోతారు. వీళ్ళ మొగుళ్ళు ఏం చేస్తారో, ఎలా సంపాదిస్తారో తెలియదు కానీ, ఇంద్రభవనాల్లాంటి ఇళ్ళు వుంటాయి. పెద్ద పెద్ద కార్లుంటాయి (ప్రొడ్యూసర్ బడ్జెట్ బట్టి) అతి ఖరీదైన పలచని చీరలు కడతారు. చార్మినార్‌లో గిల్టు నగల షాపులు చూడలేని వాళ్ళు.... వీళ్ళ ఒంటి మీదున్న నగలని చూడచ్చు. నడిచే నగల కొట్లలా ఉంటారు. ఇంక డైలాగుల విషయానికొస్తే........ పెద్దగా పని లేదు! పేజీలకి పేజీలు వెనక నుండి డబ్బింగ్ వస్తుంటే నిలబడి కనుబొమ్మల్ని ఎగరేస్తూ, పెదవి విరిచి క్రూరంగా నవ్వుతూ, మొహాన్ని అష్టవంకరలుగా తిప్పుతూ, అరచేతిలో ఇంకో చెయ్యి పిడికిలి బిగించి గుద్దుకుంటూ రకరకాల హావభావాలు ప్రదర్శిస్తుంటారు.

ఈ ఆడవిలన్లు చాలా సోమరిపోతులు! పొరపాటున కూడా వంటింట్లోకి వెళ్ళరు. ఏ పనీ చెయ్యరు. ఒకవేళ అధవా చేసినా, అటూ ఇటూ దొంగ చూపులు చూస్తూ పాలల్లోనో, కాఫీలోనో విషం కలపడం లాంటివి చేస్తారు. ప్రతి ఇంట్లో ఏడ్చే హీరోయిన్‌లాగే, వంట గదిలో విషం సీసా ఉంటుంది.

వీళ్ళకి మొగుళ్ళు ఉంటారు. సాధారణంగా చాలా మంచివాళ్ళుగానూ, వీళ్ళ వెనకాల తప్ప ముందు మాట్లడలేని వాళ్ళూ అయివుంటారు. వీళ్ళకి డైలాగులు వ్రాయడం రచయితలకి సరదాగా ఉంటుంది. ఎందుకంటే పెళ్ళాం మీద మంచి సెటైర్లు పండుతాయి. అయినా ఆడవిలన్లు ఇవన్నీ పట్టించుకోరు. "ఒక చెంచా కాఫీ పొడి అప్పివ్వండి పిన్నిగారూ! "అన్నంత మామూలుగా " ఆ వనజని లేపెయ్యి... దాని కొడుకుని కిడ్నాప్ చెయ్యి... మా మావగారి కమోడ్‌లో బాంబు పెట్టు... మాతోటి కోడలు ప్రయాణించే కారుకి బ్రేకులు తీసెయ్యి.... మా అత్తగారు దిగే మెట్లమీద నూనె పొయ్యి..... మా మరిది బ్రీఫ్ కేసులో బ్లూఫిల్మ్‌లు పెట్టి అరెస్టు చెయ్యించు... మా అన్నయ్య ఫ్యాక్టరీలో నల్లడబ్బు పెట్టి ఇన్‌కమ్ టాక్స్ వాళ్ళకి ఫోన్ చెయ్యి.... మీ ఆడబిడ్డని హోటల్ రూంకి పిలిచి రెయిడింగ్‌లో బ్రోతల్‌గా అరెస్ట్ చేయించు...."అంటూ కుటుంబ సంబంధాలని రకరకాల కోణాల నుండి ఆవిష్కరిస్తుంటారు, ఎవరైనా రోడ్డమీద కాస్త స్టైలుగా తయారయి కార్లు దిగే ఆడవాళ్ళని చూస్తే హడలి చచ్చేట్లు!

ఈ స్త్రీ పాత్రలు ఇలా శరవేగంగా రెండు మూడు వందల ఎపిసోడ్ల వరకూ క్రైమ్ తర్వాత క్రైమ్ పెనం మీద పెసరెట్లు వేసినంత తేలిగ్గా చేసుకుంటూ పోతూనే ఉంటారు. కానీ పోలీసు కేసులు కానీ శిక్షలూ కానీ ఏమీ ఉండవు. ఉత్తపుణ్యానికి మధ్యలో ఏడిచే కథానాయికలకి శిక్షలూ, జైళ్ళులాంటివి ఉంటాయి. ఏసాధారణమైన మధ్య తరగతి కుటుంబ కథ తీసుకున్నా, ఆడవాళ్ళు అర్ధరాత్రుళ్ళు రెయిడింగులలో పట్టుబడడం, కిడ్‌నాప్ అవడం, జైలుకి చుట్టాలింటికి వెళ్ళొచ్చినట్లు వెళ్ళి రావడం పరిపాటి! వీటి అన్నింటి వెనకా ఆడవిలన్ల శ్రమా, పట్టుదలా, వ్యూహం, దీక్షా చాలా ఉంటాయి. వీళ్ళు రథచోదకుల్లాంటివాళ్ళు! వీళ్ళ డ్రైవ్ లేకపోతే సీరియల్ ముందుకి వెళ్ళదు. కూర తాళింపు మాడిపోతున్నా, పిల్లల ఆకలికి ఏడుస్తున్నా..... ఇల్లు దొంగలు దోచుకుంటున్నా లెక్క చెయ్యకుండా టీ.వీ తెరలకి అంటుకుపోయి చూసే ఆడవాళ్ళు ఈ లేడీవిలన్లని తిట్టుకుంటూ, వీళ్ళ దుశ్చర్యలకి ధారాపాతంగా కన్నీరు కారుస్తూ, వారం తర్వాత వారం.... ఎవరో వస్తారని ఏదో మేలు చేస్తారని ఆశావాహకంగా ఎదురు చూస్తూ... చూస్తూనే ఉంటారు. సో... ఒక ఛానెల్ రాతల్ని నిర్ణయించే విధాతలు టీ.ఆర్.పి. రేటింగ్‌లయితే.... ఆ టీ.ఆర్.పి లని పెంచే కల్పతరువులు మధ్య తరగతి ఆడవాళ్ళు అయితే, ఆ అడవాళ్ళు అనునిత్యం కుమిలిపోతూ, రగిలిపోతూ టీ.వీలు ఆన్ చేసేటట్లు చూసే సూత్రధారులు ఈ ఆడవిలన్లు.

ఈ కీలకం తెలిసే ఆడవిలన్లు హీరోయిన్లకన్నా ఎక్కువ రేట్లని పెంచేసారు. ఒకవేళ కొంచెం తగ్గించినా, వారి కాస్ట్యూమ్స్, జ్యువెల్రీ ప్రొడ్యూసర్‌ని భరించమంటే అతను లుంగలు చుట్టుకు పోవాల్సిందే

వార్త ప్రసారాల్ని చూపే ఛానళ్ళలో నిత్యం క్రైమ్ బులెటిన్ల పేర్లతో ఆడవారు చేసే వివిధ రకాలు నేరాలు. ఘోరమైన దృశ్యాలు. అశ్లీమైన కథనాలు. సామాన్యమైన కథలలో సైతం స్త్రీలలో కుళ్ళు, కుత్సితం, పగలు, పంతాలు, అనైతిక ప్రవర్తనలు!

ఇవి మనకి అవసరమా? వాణిజ్య ప్రయోజనాల కోసం ఒకప్పుడు పుణ్యభూమిగా పవిత్రత అలరారే స్త్రీల చరిత్రలతో వెలుగొందిన మన సంస్కృతి.... ఇలా ఛానెళ్ళలో దిగజారాల్సిందేనా?

లావణ్యంగా పువ్వులు ముడవాల్సిన స్త్రీలు స్కూటీలూ, కార్లూ నడుపుతూ, కంప్యూటర్ల మీద పని చేస్తూ, అంతరిక్షానికి సైతం ఎగరడం అభ్యున్నతి కానీ ఇలా కత్తులూ, పిస్టళ్ళూ పట్టుకోవడం... కూరగాయలు తరిగినట్లు పీకలు కొయ్యడం, పట్టుకారు పట్టుకున్నంత తేలిగ్గా మనుషుల్ని పెట్రోల్ పోసి తగల పెట్టడం.... చూపెట్టడం అవసరమా?

తల్లిగా, చెల్లిగా, వదినగా, అక్కగా, అత్తగారిగా, ఒక స్నేహితురాలిగా, ప్రియురాలిగా, భార్యగా కనిపించాల్సిన స్త్రీరూపాలు.... ఇంత వికృతం చేసి రాబోయే తరాలకి మనం అందిస్తున్న సందేశం ఏవిటి? బాధ్యతున్న ప్రతి వాళ్ళూ ఆలోచించాలి!

